క్లుప్తంగా

మొహర్రం వేడుకలు ప్రారంభం



పుంజుమేరగూడలో బంగ్లాలోకి పీరీల సామగ్రి తీసుకువస్తున్న నిర్వాహకులు

రెబ్బెన: హిందు, ముస్లింలు ఐక్యంగా జరుపుకొనే మొహరం వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని పుంజుమేరగూడలో గల భూవమా తల్లి దేవస్థానంలో పోచమ్మ తల్లికి పూజలు చేశారు. సాయంత్రం గుండం తవ్వారు. గోలేటి, నంబాల, గంగాపూర్, కైరిగాం, నవేగాం గ్రామాల్లోనూ పీరీల బంగ్లాల వద్ద పీరీల గుండం తవ్వారు. ఈనెల 26న చిన్న సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భూవమా తల్లి దేవస్థానం స్థాపకుడు శ్రీకర్, అధ్యక్షుడు వినోద్ జైస్వాల్, సభ్యులు నికోడే శ్రీకాంత్, నిమ్మాజీ, భగవాన్, రాకేశ్, వెంకటేశ్, బొడ్డు రాజు, సిద్దార్థ, సాయి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి



ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ మంజూరు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరామోజు భాస్కరాచారి, అశోక్, శ్రీరామోజు వెంకటయ్య, నల్లగొండ శ్రీరాములు, తిరుపతి, మోహన్ చారి, మొండయ్య తదితరులు ఉన్నారు.

'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్ అప్రజాస్వామికం'



మాట్లాడుతున్న శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాటసింగారంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలించడానికి వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షుడిని మార్గమధ్యలో పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, చెర్ల మురళి, తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు పాల్గొన్నారు.

టీజీబీ మేనేజర్‌కు సన్మానం



సన్మానిస్తున్న జెడ్పీటీసీ సంతోష్, సర్పంచ్ సోమశేఖర్

రెబ్బెన: రెబ్బెన తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన జీకే శాస్త్రీని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్ గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలందిస్తామన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు రంగు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రహీముద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరో మూడు రోజులు అతి భారీ వర్ష సూచన ఉన్నందున మండలంలోని నవెధరి, ఖిరిడి, వాంకిడి, బంబార, బనార్‌కొసార, గణేష్‌పూర్, సోనాపూర్ వెల్గి, కనర్‌గాం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయాల్లో సహాయ అవసరాల నిమిత్తం అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వాగులు, ఒర్రెలు దాటే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

డీఏపీ కొంటేనే యూరియా

- గ్రామాల్లో నిల్వలు లేవు
- కొరతను సాకుగా చూపుతున్న డీలర్లు
- డీఏపీ తీసుకుంటేనే యూరియా
- రైతులకు అంటగడుతున్న వైనం



యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతులు

చింతలమానెపల్లి: రైతుల పంటల సాగుకు ఉపయోగించే యూరియా లభించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వీటి కొరత ఉంది. నిల్వ గోదాంలు లేక దొరకని పరిస్థితి ఉంది. పంటల సాగుకు ప్రధానంగా యూరియా, కాంప్లెక్స్ ఎరువులు 20–20–13 అవసరం. ప్రైవేటు డీలర్లు వద్ద నిల్వ పెట్టుకుని విక్రయిస్తున్నారు. రైతులు అవసరం బట్టి కొనుగోలు చేస్తారు. సాధారణంగా డీఏపీ.. సాగు ఆరంభంలో అవసరం. వర్షాలు కురిసిన తర్వాత యూరియా వరి పంటలకు కావాలి. ఇది ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడుతుంది. గ్రామాల్లో నిల్వ గోదాంలు లేక యూరియా స్థానికంగా లభించక కొరత ఏర్పడుతోంది.

అనవసరంగా అంటగడుతున్న డీఏపీ

గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు డీలర్లు యూరియా రూ.300 నుంచి రూ.350లకు, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిర్ణీత ధరలకు విక్రయిస్తున్నారు. ఆగ్రోస్, మార్క్‌ఫెడ్ సంస్థలు, సహకార సంఘాలు, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో యూరియా రూ.266, డీఏపీ ఆయా కంపెనీల ధరలకనుగుణంగా ఎమ్మార్పీలకే అందిస్తున్నాయి. కాని యూరియా కొరతను సాకుగా చూపి డీలర్లు డీఏపీ తీసుకుంటేనే యూరియా ఇస్తామని అంటున్నారు. అనవసరంగా అంటగడుతున్నారని రైతులు వాపోతున్నారు. మూడు యూరియా బస్తాలకు ఒక డీఏపీ బస్తా తీసుకోవాల్సిందే చెప్పడంతో ఆందోళనకు గురవుతున్నారు. పంటల సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలని రైతులకు ప్రభుత్వం సూచిస్తుండగా దీని సాకుగా చూపిస్తూ కంపెనీలు డీలర్లపై డీఏపీని విక్రయించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు.

అదనపు ఖర్చు..

చింతలమానెపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఒక డీఏపీ బస్తా తీసుకుంటేనే యూరియా ఇస్తామనడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు యూరియా బస్తాలకు ఒకటి రూ.266 చొప్పున రూ.798లు అవుతోంది. ఒక డీఏపీ బస్తాకు రూ.1350 ఖర్చవుతుంది. ఈ లెక్కన రైతులపై డీఏపీ బస్తా తప్పనిసరిగా కొనుగోలు చేయాలనే అనధికార నిబంధన వారికి గుదిబండగా మారింది. అవసరమైన ఎరువులనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే..

ఆయా సంస్థల వద్ద డీఏపీ నిల్వలు ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల మేరకే రైతులకు విక్రయిస్తున్నామని ఏవో రామక్రిష్ణ తెలిపారు. యూరియా కొరత లేదని విడతల వారీగా యూరియా అందజేస్తామని అన్నారు. ఈ విషయంపై మార్క్‌ఫెడ్ మంచిర్యాల అధికారి నరేశ్‌ను వివరణ కోరగా డీఏపీ బస్తాలు తప్పనిసరిగా అమ్మాలనే నిబంధన ఏదీ లేదని రైతులకు అనవసరంగా విక్రయించొద్దన్నారు. ఈ విషయంపై డీలర్లతో మాట్లాడుతామని ఆయన వివరించారు.

డీఏపీని కొనాలని అంటున్నారు



పంటలకు వేసే డీఏపీ ఖరీఫ్ సీజన్ గతంలోనే స్థానికంగా కొనుక్కున్నాం. ఇప్పుడు యూరియా అవసరం ఉంది. మార్కెట్‌లో కొందామంటే దొరకడం లేదు. డీఏపీ కొంటేనే యూరియా ఇస్తామని అనడం సరికాదు.

– లచ్చక్క, బాలాజీ అనుకోడ

డబ్బులు లేవు



పంటలకు యూరియా కావాలి. డీఏపీ ఎరువు అవసరం లేదు. అనవసరంగా డీలర్ల అమ్మకాల కోసం డీఏపీ అంటగడితే ఏం చేసుకోవాలి. యూరియా కొనుక్కోవడానికే డబ్బులు ఉన్నాయి. డీఏపీకి అదనంగా డబ్బులు ఎక్కడ నుంచి తీసుకురావాలి.

– దండ్రె రామయ్య, బాబాసాగర్

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం







నియామకపత్రం అందుకుంటున్న బాలకృష్ణయాదవ్, శ్రీధర్, వేణు

బెజ్జూర్: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ నియమితులయ్యారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, తాలుకా కన్వీనర్ వీరభద్రచారిలు గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. అధ్యక్షుడిగాగా నియమించిన పార్టీ నేతలకు బాలకృష్ణ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తా అశోక్, ఆదివాసీ మండల అధ్యక్షుడు మేశ్రం రాజారాం, నాయకులు కోలా కిష్టయ్య, డబ్బుల రుషి, ఎలకరి సంజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: బీజేపీ అధ్యక్షుడిగా చిర్రకుంటకు చెందిన మద్దెర్ల శ్రీధర్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నియామకపత్రాన్ని అందజేశారు.

కెరమెరి: బీజేపీ మండల అధ్యక్షుడిగా సంగెం వేణును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నియామకపత్రం అందించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని వేణు ఈ సందర్భంగా తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎంపీపీ మల్లికార్జున్, తదితరులు

ఆసిఫాబాద్: మండలంలోని బూర్గుడ గ్రామంలో గురువారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వైస్ ఎంపీపీ పెంటయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: నాటిన ప్రతీ మొక్కను బతికించాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో మహేందర్ అన్నారు. మండలంలోని జోడేఘాట్‌లో ఉన్న బృహత్ పల్లె ప్రకృతివనాన్ని గురువారం వారు సందర్శించారు. నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏలు నాగోరావు, హిరాలాల్, మహేందర్, గ్రామపెద్ద రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే వైద్య సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్యాధికారి రామకృష్ణతో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట పిచికారీ చేయాలన్నారు. ఎక్కువగా నీరు నిల్వ ఉన్నచోట మత్స్యశాఖ ఆధ్వర్యంలో గంబుసియా చేపలు పెంచాలన్నారు. పాఠశాలల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మించాలని వినతి



బూర్గుడ స్టేజీ వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్: మండలంలోని బూర్గుడ గ్రామంలో ఫోర్‌లేన్ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ నిర్మించడంతోపాటు బీసీ కాలనీ బస్టాప్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడేకు ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ డ్రైయినేజీ నిర్మించకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలో చేరడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బూర్గుడ బస్టాప్ వద్ద యూటర్న్ లేక రహపల్లి, చోర్‌పెల్లి, రాజూరా, బూర్గుడ ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం బూర్గుడలోని ఫోర్‌లేన్ రహదారి పక్కన ఇళ్లలోకి చేరిన నీటిని ఎంపీపీ పరిశీలించారు. ఆయన వైస్ ఎంపీపీ సుంకరి పెంటు, ఎంపీటీసీ రమేశ్, బూసి భీమేశ్, మంగ, వెంకన్న, ప్రకాశ్ ఉన్నారు.

పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

జిల్లా కేంద్రంలో సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ కలెక్టర్ హేమంత్ బోర్కడేకు జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి గురువారం వినతి పత్రం అందించారు. పార్టీ నాయకులు దయాకర్, పెందూర్ రాజేశ్ ఉన్నారు.



బెజ్జూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని సోమిని, ఎలుకపెల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లు కోతకు గురయ్యాయి. ఎడ్లబండ్లు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోడ్లకు మరమ్మతు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఈ–కుబేర్ వెబ్‌సైట్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సంఘం మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, కార్యదర్శి భిక్షపతితో కలిసి గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈపీఎఫ్ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సప్లమెంటరీ, సరెండర్ లీవ్, డీఏ ఏరియర్స్, ఇతర బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈనెల 31లోగా ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘం ప్రతినిధులు గడ్డం భిక్షపతి, రాకేశ్, ఇందారపు ప్రకాశ్, రమేశ్, రవిశంకర్, గంగాభవాని, పర్శ చంద్రశేఖర్ దామోదర్, వికాస్, యాదగిరి సమత, సుజాత పాల్గొన్నారు.

నార్నూర్: ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని దశల వారీగా ఉద్యమం చేస్తామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) మండలాధ్యక్షుడు సునీల్ చౌహాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంతకాల సేకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు రవికుమార్, రవీందర్, విజయ పాల్గొన్నారు.

కరెంట్ లేక అవస్థలు



కెరమెరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్

- కెరమెరి మండలంలో దుస్థితి
- గ్రామాలు 156.. సబ్‌స్టేషన్ 1
- అధికలోడ్‌తో సరఫరాలో అంతరాయం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వేడుకోలు

కెరమెరి: ప్రస్తుత రోజుల్లో కరెంటు లేకుండా అరగంటపాటు ప్రజలు ఉండలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. విస్తీర్ణంతోపాటు భౌగోళికంగా అతిపెద్దగా ఉన్న కెరమెరి మండలంలో మొత్తం 156 గ్రామాలు ఉన్నాయి. అందులో గృహ వినియోగానికి సంబంధించిన విద్యుత్ మీటర్లు 7175 ఉండగా వ్యవసాయ మీటర్లు 300 ఉన్నాయి. వీటిన్నింటికి ఒకే 33 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. మొత్తం 5 ఫీడర్లు ఉన్నాయి. ఏ ఫీడర్‌లో అంతరాయం ఏర్పడిన అందరికి ఇబ్బంది వస్తుంది. సబ్‌స్టేషన్‌పై పడుతున్న అధిక లోడ్ కారణంగా సరఫరాలో అంతరాయం కలగడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు అతి పురాతన లైను కావడం వల్ల ఇబ్బంది తప్పడం లేదు.

24 ఏళ్ల క్రితం సబ్‌స్టేషన్ నిర్మాణం..

24 ఏళ్ల క్రితం సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అప్పుడు 2,200 వేల వరకు గృహాలకు సంబంధించిన విద్యుత్ మీటర్లు ఉండగా.. 20 వ్యవసాయ మీటర్లు ఉన్నాయి. అప్పటికి ఇప్పటికి అన్ని మీటర్లు, వినియోగం పెరిగింది. కాని సబ్‌స్టేషన్ మరోటి ఏర్పాటు చేయలేదు. దీంతో ఒకే దానిపై అధికలోడ్ పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తోంది. రైతులు తమకు అవసరమైనప్పుడు విద్యుత్‌ను వాడుకుంటున్నారు. అన్ని గ్రామాలకు కలిపి సబ్‌స్టేషన్ ఒకటే ఉండడం, దానిపై తీవ్ర భారంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. మరోటి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

లైన్లు దూరంగా..

విద్యుత్ లైన్లు దూరంగా ఉండడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. జోడేఘాట్, పరందోలి, అంతాపూర్, శంకర్‌లొద్ది లాంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సరిచేసేందుకు 24 గంటలు పడుతుంది. మరో వైపు సిబ్బంది 20 మంది ఉండాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



గృహ వినియోగ విద్యుత్ మీటర్లు అధికంగా ఉన్నాయి. సబ్‌స్టేషన్ ఒక్కటే ఉండడంతో ఇబ్బంది తప్పడం లేదు. సిబ్బంది తక్కువగా ఉన్నారు. అయినా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ, కెరమెరి

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



కాగజ్‌నగర్‌రూరల్: నోటికి నల్ల గుడ్డ కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు



ఆసిఫాబాద్: కలెక్టరేట్ ఎదుట భోజనాలు చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌రూరల్/కౌటాల/కెరమెరి: జిల్లాలో పంచాయతీ కార్మికుల సమ్మె నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మె గురువారం నాటికి 15వ రోజు చేరింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేసి భోజనాలు చేశారు. కాగజ్‌నగర్‌లో కార్మికులు నోటికి నల్ల గుడ్డ కట్టుకుని నిరసన తెలిపారు. వారి సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్, కౌటాలలో సమ్మెకు ఎస్‌హెచ్‌ఆర్సీ సభ్యులు మద్దతు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని కెరమెరిలో కార్మికులు స్పష్టం చేశారు.

ఖాళీ కార్యాలయాలను హాస్టళ్లకు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: సమీకృత కలెక్టరేట్ ప్రారంభంతో ఖాళీ అయిన ప్రభుత్వ కార్యాలయాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎస్ఎంఎస్ బాలికలు, బీసీ ఎస్ఎంఎస్ బాలురు హాస్టళ్లకు కేటాయించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షుడు నిఖిల్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ ఉన్నారు.

బాలల హక్కులు కాపాడుదాం

ఇంద్రవెల్లి: బాలల హక్కులను ప్రతిఒక్కరూ కాపాడాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. ముత్నూర్ గ్రామాన్ని బాలల స్నేహపూర్వక గ్రామంగా ఎంపిక చేసి, సర్పంచ్ బాగుబాయి అధ్యక్షతన బాలల హక్కుల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు.

'ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దు'

బోథ్: ప్రతిపక్షాల మాటలను నమ్మి మోసపోవద్దని మాజీ ఎంపీ నగేశ్ అన్నారు. గురువారం మండలంలోని పార్డి(బి), పార్డి (కె), చింతలబోరి, దేవుల్ నాయక్‌తండా, వజ్జర్, గొల్లాపూర్ గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ నాయకులు మూడు గంటల విద్యుత్ మాత్రమే ఇస్తామని ప్రకటనలు చేస్తున్నారనిచ, వారిని గ్రామాల్లోకి రానివద్దన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల విద్యుత్ అందిస్తున్నామన్నారు. మళ్లీ ఆదివాసీలను మాటలతో మభ్యపెడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, తాంసి జెడ్పీటీసీ రాజు, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, ప్రశాంత్, వెంకన్న, ఆడె శీల, శ్రీధర్‌రెడ్డి, మారుతి పాల్గొన్నారు.